

# కొవ్వొత్తి

సోమంచి ఉషారాణి

మోహన్ ఉదాసీనంగా పార్కులో అడుగు పెట్టాడు. రోజూ ఆఫీసవగానే కాసేపు పార్కులో కూర్చుని ప్రేమికులనీ, పిల్లల్ని, పెద్దల్ని గమనించి నిట్టూర్చుడం అతని హాబీ!

అతనికి కొంచెం దూరంలో కూర్చుని సరసాలాడుతూ, గలగలా నవ్వుతున్న కొత్త జంట మీద అతని దృష్టి నిలిచిపోయింది. 'ఈ జన్మకి తనకా భాగ్యం లేదేమో!'

"కంపెనీ కావాలా?" అతని చెవి దగ్గరగా వినబడిన మాటలకి ఉలిక్కిపడి చూశాడు. ఓ అందమైన అమ్మాయి! ఆ పెద్ద పెద్ద కళ్లు చూస్తూ దృష్టి మరల్చలేకపోయాడు.

"హ్యా! అలా చూడటం మీ అలవాటా?" ఆమె కిలాకిలా నవ్వుతుంటే బలవంతాన తలవంచుకున్నాడు.

"ఎందుకండీ, ఏదో తప్పు చేసినట్లు తలవంచుకున్నారు? మీకు మాటలు రావా?" చనువుగా అతని చేతి మీద చేయి వేస్తూ, ఆప్యాయంగా పలకరించింది.

ఆ మాత్రం ఆప్యాయతకే చలించిపోయాడు మోహన్. చెమర్చిన కళ్లను దాచుకునే ప్రయత్నం చేయలేదు.

'ఒక మనిషితో ఇలాంటి ఆప్యాయపూరితమైన స్పర్శ అనుభవించి ఎన్నాళ్లయింది? ఈమె ఎవరు? ఏమిచ్చి ఋణం తీర్చుకోగలడు?'

"మీ బాధ నాతో చెప్పుకోవచ్చు. ఒంటరితనం ఫీలయ్యే నీ లాంటివాళ్లకి టైమ్ పాస్ బఠాణీ లాంటి దాన్ని! మీ కష్ట సుఖాలు విని మీ ఆవేదన తగ్గించడమే కాక, నాకు తోచిన సలహా ఇస్తాను. మీ సందేహాలు తీరుస్తాను. మీకు నచ్చితే ఆచరించవచ్చు. లేకపోతే టేకిటీజీ! ఓకే?"

ఒక దేవతలా ప్రత్యక్షమై, వరాలిస్తానన్నట్లు నిలబడిన ఆమెకేసి అబ్బురంగా, ఆరాధనగా చూశాడు మోహన్.

ఇలాంటి అమ్మాయిలు కూడా ఉంటారా? మగాడు పలకరిస్తేనే 'టచ్ మి నాట్' లా ముడుచుకుపోతారు మరి!

"మహానుభావా! ఇంతకీ తమకి మాటలు వచ్చా? నన్ను ఉండమంటారా? వెళ్లమంటారా?" ఆ అమ్మాయి సూటిగా అడుగుతుంటే నిజంగా వెళ్లిపోతుందేమోనని కంగారు పడ్డాడు.

"మీ పేరు? ఏం చదువుకున్నారు?" చిన్నగా నవ్వుతూ పలకరించాడు.

ఆ అమ్మాయి తల వంచుకుని నేల మీద ఏదో వెతకసాగింది. మోహన్ ఆశ్చర్యంగా "ఏంటి వెతుకుతున్నారు?" అన్నాడు తనూ వెతకడానికి ప్రయత్నిస్తూ.

"ముత్యాలేమైనా దొరుకుతాయేమోనని!" ఆమె సీరియస్‌గా అంటూంటే, అర్థమైనట్లు గట్టిగా నవ్వాడు మోహన్.

"హమ్మయ్య! మీకు మాటలు రావేమో అనుకున్నాను. నా పేరు రుచిత! ఎం.ఏ. సైకాలజీ చేశాను. మనుష్యుల్ని ముఖ్యంగా మీలాంటి ఒంటరివాళ్లకు పరిచయం చేసుకుని, వారి మనస్తత్వాలు స్టడీ చేసి, తోచిన సలహా ఇచ్చి, వాళ్లిచ్చింది పుచ్చుకుంటాను. స్వామికార్యమూ, స్వకార్యమూ అన్నమాట!...

"ఆఁ ఆఁ ఉండండి. సందేహం నాకర్థమైంది. హాయిగా ఏ లెక్చరరు ఉద్యోగమో చేసుకోక ఇదేమిటి? అంటారా? ఆ ఉద్యోగం చాలా మంది చేయగలరు. అసలే నిరుద్యోగసమస్య ఉన్న మన దేశంలో ఒక మనిషికి ఉద్యోగం కల్పించడం ద్వారా నాకు తోచిన మానవసేవ కాక దేశసేవ కూడా చేస్తున్నాను. ఏమంటారు? అదీ కాక ఈ 'టైమ్ పాస్' ఉద్యోగం అందరూ చేయలేరు. దానికి చాలా గట్స్ ఉండాలి. ఏమిటి నాన్-స్టాప్‌గా వాగుతోంది వాగుడుకాయ అనుకుం టున్నారా?"

"అబ్బే అదేం లేదు. ఇన్నాళ్లూ నాతో మాట్లాడేవాళ్లే లేరని బోర్‌గా ఫీలయ్యేవాణ్ని. మీలాంటి స్నేహితురాలు దొరికినందుకు నాకు నిజంగా చాలా ఆనందంగా ఉంది" అతని కళ్లలో ఆనందం, కృతజ్ఞత కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

"టైమ్ పాస్ బఠాణీ" అంటూ వచ్చాడో కుర్రాడు. అతని దగ్గర చెరో పొట్లం తీసుకున్నాడు మోహన్. రెండూ కలిపేసి పెద్ద కర్చీఫ్‌లో పోసి "నాకు ఇలా తినడమే ఇష్టం" అంది రుచిత.

"వద్దండీ! నా గురించి తెలియక..." కంగారుగా అన్నాడు.

"మీరు చెబితే కదా!" కూల్‌గా నవ్వింది రుచిత.

"నేను 'ఎయిడ్స్' పేషెంట్‌ని" సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు, ఆమె ఎలా రియాక్ట్ అవుతోందోనని.

"అయితే?" చాలా మామూలుగా అడిగింది రుచిత

"నాతో కలిసి తినడం..." సగంలో ఆపేశాడు.

"ఏమీ కాదు. మీలాంటి చదువుకున్నవాళ్లు కూడా ఎయిడ్స్ పట్ల అవగాహన లేనట్లు మాట్లాడటం ఏమిటి? మీకు తెలీదా?" సీరియస్‌గా అడిగింది.

"నాకు తెలుసనుకోండి. మీరన్నట్లు 'ఎయిడ్స్' పట్ల అవగాహన లేనివాళ్లే ఎక్కువ కదా! అందుకని మీరు కూడా..."

"మీకు అమ్మా, నాన్న ఉన్నారా?"

"ఉన్నారు. ఒక చెల్లి కూడా!"

"మరి..." 'ఒంటరిగా ఎందుకు బాధపడుతున్నారని' అర్థం వచ్చేట్లు అడిగింది రుచిత.

నిట్టూర్చాడు మోహన్. ఈ మధ్య అది అతనికొక హాబీ అయిపోయింది. "మొదటినుండీ ఇంట్లో మా మధ్య మనుతాను బంధాలు అంతంతమాత్రమే! అమ్మా, నాన్న ఇద్దరూ ఉద్యోగం చేస్తారు. అమ్మే ఇంటి పనీ, బజారు పనీ, ఉద్యోగం అన్నీ చేసుకోవటంతో బాగా అలసిపోయేది. ఇంటి పనిలోనూ, బజారు పనిలోనూ నాన్నగారు సాయం చేయడం లేదని ఇద్దరూ వాదించుకునేవారు. 'నాకు కుదరదు. నా బిజినెస్ అలాంటిది' అనేవారు నాన్న. మమ్మల్ని దగ్గరకు తీసుకుని ముద్దు చేయడం, మా చదువు గురించి పట్టించుకోవడానికి ఇద్దరికీ తీరికుండేది కాదు. ట్యూషన్లు పెట్టింది. బాగా చదువుకోమని మాత్రం చెప్పేవారు.

అమ్మకి ఎప్పుడైనా ఒళ్లు బాగుండకపోయినా, లేవకపోయినా నాన్న బయట నుంచి కారియర్ తీసుకొచ్చేవారే కాని వంటింట్లోకి వెళ్లి స్టౌ వెలిగించడం నేను చూడలేదు."

"మీ నాన్నలాంటివాళ్లు ఈ లోకంలో చాలా మంది ఉన్నారులే!" నిరసనగా అంది రుచిత.

"నాగురించి చెప్పి సుత్తి కొట్టడం లేదుకదా! మీగురించి చెప్పండి. మీ రెండుకీ టైమ్ పాస్..."

"దాని గురించి ఇందాకే చెప్పారు కదండీ! నాకు అమ్మా, నాన్న ఉన్నా, వాళ్లకి నా సంపాదన కావాలి అంతే! అది ఎలా సంపాదించానో వాళ్లకక్కర లేదు. వాళ్లు చదివించారు కాబట్టి వాళ్ల ఋణం తీర్చుకోవాలి. కట్నం ఇచ్చి పెళ్లి చేయరట! మేమే నచ్చినవాణ్ని చేసుకుంటే సరే! లేక పోతే డబ్బు సంపాదించి వాళ్ల చేతిలో పోయాలి. అంతే! పోనీ లెండి! ప్రపంచంలో ఉన్న ఎన్నో రకాల మనుష్యుల్లో వాళ్లూ ఒకళ్లు అంతే!!" విషాదంగా నవ్వింది.


"ఐయామ్ సారీ! నేనే కాదు, చాలామంది అనుకుంటారు, ఎదుటివాళ్లు చాలా ఆనందంగా ఉన్నారు. వాళ్లకే సమస్యలూ లేవు. నాకే అన్ని సమస్యలూ అని! నిజానికి మనకన్నా కష్టాలూ, కన్నీళ్లూ అనుభవించేవాళ్లు లోకంలో ఉంటారు అని తెలిసిన రోజున, మన సమస్య ఒక సమస్యే అనిపించదు."

"అబ్బో! ఫిలాసఫీ బాగానే ఒంట బట్టిందే! ఫిలాసఫీ పుస్తకాలు బాగా చదువుతారనుకుంటాను."

"నాకు జీవితంలో మిగిలింది అదే కదండీ!"

"ఇంతకూ మీకు ఎయిడ్స్ ఎలా వచ్చిందో చెప్పలేదు?" రుచిత ప్రశ్నకి మోహన్ కళ్లలో నీళ్లు తిరిగాయి.

"చెప్పానుగా! మా వాళ్లు మేము ఎలా చదువుతున్నామో, ఏంతింటున్నామో పట్టించుకోకపోయినా కష్టపడి చదివి, కంప్యూటర్ ఇంజినీరు నయ్యాను. ఒకసారి బయట చాట్ తింటుంటే, అక్కడ ఉల్లిపాయలు కట్ చేసే వ్యక్తికి ఎయిడ్స్ ఉందట! పొరపాటున అతని చెయ్యి తెగి, అతని రక్తం ఉల్లిపాయలకి అంటినా, ఆ జనం రద్దీలో పట్టించుకోకుండా ఉల్లిపాయలూ వేసి మా కందించాడు. నాకే కాదు, ఇంకొంత మందికి కూడా ఇచ్చి ఉంటాడు. తరువాత పెద్ద గొడవైంది. అతన్ని తీసేశారనుకోండి. అప్పటికే జరగవలసిన అనర్థం జరిగిపోయింది. మా వాళ్లు నన్నొక అంటరానివాడిలా చూడటం మొదలుపెట్టారు. కడుపులో పెట్టుకోవలసిన కన్న తల్లిదండ్రులూ, కంటికి రెప్పలా చూసుకోవలసిన తోడబుట్టిన చెల్లెలూ నన్ను అసహ్యించుకోవడం మొదలు పెట్టారు. అదీ కాక, నాకు ఎయిడ్స్ ఉందని తెలిస్తే తమ కుటుంబానికి పరువు నష్టమనీ, చెల్లాయికి పెళ్లి కాదనీ చీదరించుకునేవారు. అందుకే విడిగా ఒక గది అద్దెకు తీసుకుని నా బ్రతుకు నేను బ్రతుకుతున్నాను. చెల్లాయి పెళ్లయిపోయింది. వాళ్లకి ఒక్కతే కూతురనీ చెప్పుకున్నారు. రేపో మాపో పోయేవాడికి ఎందుకీ మమతానురాగాలని మౌనంగా..." గొంతు గాద్గదికమై మాట రాలేదు.



రుచిత కళ్లలో తడి మెరిసినా బయటకు రానీయలేదు. "ఇంక బయలుదేరదామా? బాగా చీకటిపడింది" అంది లేస్తూ.

మోహన్ కూడా లేస్తూ, "ఈ రోజు నా జీవితంలో మరిచిపోలేను. రోజూ ఇక్కడికి వస్తాను. మీకు వీలైనప్పుడు కంపెనీ.. అదే టైమ్ పాస్ చేస్తారుగా!" ఆమె చేయి ఆప్యాయంగా నొక్కి వదిలేశాడు తన పర్సులో ఉన్న మొత్తాన్ని ఆమె చేతిలో పట్టి, వెనుదిరిగాడతను.

రుచిత కళ్లు మెరిశాయి. అది ఆనందమో, విషాదమో చెప్పడం చాలా కష్టం! ఆమెకి ఇటువంటి విషాదాలు విని విని అలవాటైపోయాయి. ఎందుకంటే ఏ తోడులేని ఒంటరివాళ్లకే తన కంపెనీ ఇస్తుంది. అటువంటప్పుడు వాళ్లు చెప్పే రకరకాల విషాదగాథలు విని ఆమె మనస్సు ఎప్పుడో బండబారిపోయింది. లేకపోతే ఇటువంటి టైమ్ పాస్ చేయాలంటే అది అంత తేలిక కాదు. ఎంతో తెగువ, ఆత్మస్థైర్యం, మొండితనం లేకపోతే సాధ్యం కాదు.

'కరిగే కొవ్వొత్తి పైన కనికరం ఎవ్వరికి? ఎవ్వరికి?' దూరంగా పాట వినిపిస్తోంది.

00000

ఇద్దరూ అప్పుడప్పుడు కలుసుకుని ఎంతో ఆత్మీయుల్లా, మంచి స్నేహితుల్లా జోకులేసుకుని, అనేక విషయాల మీద చర్చించుకుంటూ ఉండేవారు.

మోహన్‌లో అదివరకటి విషాదం, బాధ మచ్చుకి కూడా లేవు. ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. తన జీతంలో సగం ఎయిడ్స్ రోగులకి వెచ్చిస్తున్నాడు. వాళ్లలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఒక రోజు ఇలాగే పార్కులో రుచిత కోసం ఎదురుచూస్తున్న అతని దగ్గరికి తల్లిదండ్రులు రావడంతో నివ్వెరపోయాడు. నిజమో, కలో అర్థం కాలేదు.

"అమ్మా, నాన్నా!" అంటూ ముందుకు వెళ్లబోయి సంశయంగా ఆగిపోయిన అతన్ని, వాళ్లే 'బాబూ! మోహన్' అంటూ కౌగలించుకున్నారు. అతన్ని ముద్దు పెట్టుకుని తమ అవివేకానికి, అజ్ఞానానికీ క్షమించమన్నారు. తమతో ఇంటికి వచ్చేయమన్నారు. మోహన్ ఆనందానికి అంతు లేకపోయింది. దూరంగా బెంచీ మీద కూర్చుని వాళ్లని ఆనందంగా వీక్షిస్తున్న రుచిత, అతని కళ్లబడింది.

'అందుకేనా తన తల్లిదండ్రులు ఎక్కడపని చేస్తున్నారో చెప్పమంది? ఆమెకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలడు?' ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపుతున్న రుచిత లాంటివాళ్లు కరిగిపోతున్న కొవ్వొత్తులని చాలా మందికి తెలియదు. ఈ స్వార్థ పూరితజగత్తులో అది ఒక బ్రతుకు తెరవుగా ఎంచుకున్న అందులో స్వార్థం కన్నా తమ వలన ఎదుటివాళ్లు ఏ మాత్రం సంతోషపడినా, వారి జీవితంలో చిరుదీపం అదే పదివేలని, అదీ ఒక సమాజ సేవ తద్వారా దేశసేవని భావించేవాళ్లు అరుదు!